కథ

# ఒక మిలంతి కల

మల్లిపురం జగదీశ్
94401 04737

'మిలంతి' మా ఊరి కోడలుపిల్ల. మోహనగాడు రెక్కపట్టి తెస్తే.. (రెక్క పట్టడం = ఎత్తుకువచ్చి పెళ్లాడటం, గాంధర్వ వివాహం) మా ఊరొచ్చిన ఇల్లాలు. వచ్చిన కొద్దిరోజుల్లోనే ఆ పిల్ల అందరి తల్లో నాలుక అయిపోయింది. ఎలాగంటే.. పనంటే చాలు పరిగెడుతుంది. అది 'మనదా, పక్కింటోళ్లదా!?' అని చూడదు. బొరిగో.. కంకో (కంక = బొరిగి లాంటి ఒక పని ముట్టు) చేత బట్టుకుని బయల్దేరిపోతుంది. గొప్పు తవ్వడమో.. కొండ తువ్వడమో.. (రెండు పనులూ ఒకటే కానీ.. నేల చేస్తే 'తవ్వడం'. అది బొరిగితో చేస్తారు. కొండపైన చేస్తే 'తువ్వడం'. అది కంకతో చేస్తారు).. తుప్ప నరకడమో.. గాబు తియ్యడమో.. చింత బొట్టలేరడమో.. చీపుళ్లు కట్టడమో.. పనసకాయ చెట్టు దించడమో.. కందులు గింజ కొట్టడమో.. ఏదో ఒక పనిలోనే ఉంటుంది పొద్దల్లా. దాన్ని పలకరించాలంటే మనమూ ఆ పనిలో ఉండాలి.

ఓ రోజు.. ఆరికోల చింత బొట్టలు ఒలిచి ఎండలో ఆరేస్తున్నది.

''అది మన పని కాదు గదే?'' అని అడిగితే..

''సెయ్యడానికి పని మనదే అవ్వాలేటి బావా? ఆ పని సేసేస్తే ఆళ్లు మనోల్లైపోరా?'' అని తిరిగి ప్రశ్నించింది.

అందుకే.. అది అందమైన పిల్ల...

ఎంత అందగత్తె అంటే.. ఎప్పుడు చూడూ చెమటతోనే మెరుస్తుంటుంది.

అది అందమైన పిల్ల... ఎంత అందగత్తె అంటే.. దాని చేతిలో ఏదో ఒక పనిముట్టు కదులుతూనే ఉంటుంది.

అది అందమైన పిల్ల... ఎంత అందమైన పిల్ల అంటే.. పనితో మనుషుల్ని ముడేస్తూనే ఉంటుంది.

అలాంటి అందగత్తె నీళ్లోసుకుంది. మోహనగాడికే కాదు.. మా ఊరోళ్లందరి కళ్లల్లో వనాలు మొలిచేయి. ఒక్కొక్కరూ ఒక్కోలా పలకరించేరు.

''ఏటే మనవరాలా! పుల్ల మామిడి బెల్లం కూర తేవాలేటే?'' అని కురమ తాత దాని తలమీద చెయ్యేసి ప్రేమగా నిమిరేడు.

''ఓలె ఒదినే! జిలేబి పొట్లం తెప్పిస్తానైతే మీ యన్నకి సెప్పి?'' అని పక్కింటి గయారి పలకరించింది.

మిలంతి మాత్రం నవ్వుతూనే సిగ్గుపడింది. లోలోపల బిడ్డను తలుచుకుంది. మోహనగాడి కౌగిలిని తలుచుకుని తన్మయత్వంతో గెడ్డలో స్నానానికి దిగింది.

ఆ గెడ్డ మా ఊరి దారికి కింద పారుతుంటుంది. ఆ దారి కింద ఊర్లతో మమ్మల్ని కలుపుతుంటుంది. మరో ఊరికి చేరాలంటే ఆ దారిలో గెడ్డ దాటాల్సిందే. ఆ గెడ్డ నిరంతరమూ పారుతుంటుంది. ఇంకడమెరగని ఇరుకు గెడ్డ. ఇరుకవడం వల్లే దానిని 'దొంగ గెడ్డ' అని కూడా అంటాం. ఎండాకాలంలో ఎంత మంచిదో.. వానాకాలంలో అంత ప్రమాదకరమైనది. ఎగువన ఏ కొండ మీద మేఘం కరిగినా దీని ప్రవాహం ఉధృతమవుతుంది. ఎప్పుడు ఎలా పారుతుందో మా ఊరోళ్లే కాదు.. ఆ గెడ్డ దాటిన ఏ ఊరోళ్లూ అంచనా వెయ్యలేరు. ఎగువున ఏ కొండ మీద వాన కురిసినా.. మా రాకపోకలు ఆగిపోతాయి. మబ్బు చూసి గెడ్డ దాటాల. చినుకు పసిగట్టి దారి నడాల. తేడా వచ్చిందో ఊరితోనే కాదు.. ఈ లోకంతోనే సంబంధాలు తెగిపోతాయి. ఇది తెలియక గెడ్డ దాటుతున్న పశువులు ఎన్నో కిందికి కొట్టుకుపోయాయి. ఆ ప్రవాహ వేగానికి జారి కింద రాళ్లకు గుద్దుకుని ప్రాణాలొదిలేయి. అప్పుడెప్పుడో ఇద్దరు మనుషుల్ని కూడా కోల్పోయింది కొండ. అది గెడ్డ తప్పు కాదు. ఏ కొండల మీంచి పారిన నీరో.. ఇక్కడ ఇలా గెడ్డగా పారుతుంది. రెండు కొండలు కలిసే చోటు. దాని మీంచి మా ఊరి దారి.

అక్కడ ఒక సిమెంట్ చప్టా కట్టాలని ఎగువూర్లన్నీ డిమాండ్ చేసేయి. ఎగువూర్లేటి.. మా ఊరికి దారవుద్దంటే మీమూ కలిసేము ఆళ్లతోటి. సర్పంచ్ ఎన్నికల్లో ఆ సిమెంట్ చప్టా ఒక వాగ్దానమయింది. సర్పంచులు మారేరు గానీ అక్కడ సిమెంట్ చప్టా నిర్మాణం మాత్రం జరగలేదు. అక్కడికి సిమెంటు బస్తాలు మొయ్యడం సాధ్యం కాదని ఒకడూ.. సిమెంటు తెచ్చినా ఇసుక బస్తాలు నప్పడం అసాధ్యమని మరొకడూ.. అనీ అనీ వాళ్ల పదవీ కాలాన్ని దాటించేసారు కానీ, ఆ దారికి ఒక సిమెంట్ నిర్మాణాన్ని ఇవ్వలేకపోయేరు.

అక్కడ ఖానా కట్టాలంటే ఆ గెడ్డకి ఇవతల దారి చదును చెయ్యాలని తీర్మానించేరు కొన్నాళ్లకి. కొండ మీద దారి ఖర్చుతో కూడుకున్నది. మేము ఓటర్లుగా తప్ప మరే లెక్కల్లోనూ దొరకని వాళ్లం. అందుకే ఆ దారి సర్పంచ్ ఎన్నికల్లో వాగ్దానంగానే మిగిలిపోయింది.

కానీ మాకు..!? ఆ దారి.. సంత దారి! ఈ ప్రపంచానికి మేమున్నామని తెలిపే మసక మసక చిరునామా! ఆ దారి.. కొండంత చీకటిలో కిరసనాయిలు బుడ్డీ. అదీ లేకపోతే మిట్ట మధ్యాహ్నమైనా చీకట్లో అడుగులేస్తున్నట్టు ఉంటుంది. అందుకే.. ఆ దారి మీద చప్టా కొన్నాళ్లు వాగ్దానంగా నడిచింది. నడిచి నడిచి అలిసిపోయిందేమో! మరి కొన్నాళ్లకి వానలో కొట్టుకుపోయింది. కొన్నాళ్లు అప్లికేషన్లలో అర్జీగా నడిచింది. గ్రీవెన్స్ హాల్లో అధికారుల ముందు దర్జాగా నిలబడి మా ఊరికి పేరుందని గుర్తుచేసి కలలకు అలవాటు చేసింది. మా

